క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి జిల్లాలోని ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దళిత అభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి ప్రకటన తెలిపారు. ఈ–పాస్ ద్వారా ఆగస్టు 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'తెలంగాణ వాటా వదులుకునేదే లేదు'

నార్నూర్: గోదావరి నదిలో తెలంగాణ వాటాను వదులుకునే ప్రసక్తే లేదని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బనకచర్ల ప్రాజెక్టుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూర్యవంశీ, శేషు రాథోడ్, శివాజీ, బోస్లె సంతోష్, ఆడే సురేశ్, ఫెరోజ్ ఖాన్, జడే దయానంద్, విలాస్ పవార్ పాల్గొన్నారు.

వసతి గృహం పరిశీలన

నార్నూర్: పోషణ్ చర్చ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో గంగాసింగ్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో సాయిప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ అంజనేయులు, వార్డెన్ రాథోడ్ అశోక్, పీఈటీలు గుగ్లోత్ రాంచందర్ ఉన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

కైలాస్‌నగర్: బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదిగేలా స్వయం సమృద్ధిని సాధించాలని పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు ఉమాదేవి అన్నారు. ఆదిలాబాద్ పట్టణ సమాఖ్య కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. పొదుపు పాటించడం, రుణాల చెల్లింపు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, మహిళాశక్తి అమలు వంటి అంశాలపై చర్చించారు. సమావేశంలో కమిటీ సభ్యులు పార్వతి, వందన, లలిత, సీవో గంగన్న పాల్గొన్నారు.

కేజీబీవీలో 'జ్వాల' ప్రారంభం

సిరికొండ: మండలంలోని కేజీబీవీ పాఠశాలల్లో శుక్రవారం జ్వాల కార్యక్రమాన్ని శుక్రవారం ఎస్సై పూజ ఆధ్వర్యంలో ప్రారంభించారు. బాలికలు ఆపద కాలంలో స్వీయ ఆత్మ రక్షణ కోసం అవాంఛనీయ ఘటనల నుంచి తమను తము రక్షించుకునేందుకు జ్వాల శిక్షణ ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. పది రోజుల పాటు శిక్షణ అందిస్తామన్నారు., కేజీబీవీ ఎస్‌వో సంధ్యరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆంగ్లభాష నైపుణ్యం పెంపొందించాలి

ఉట్నూర్‌రూరల్: గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న గిరిజన బాలబాలికల్లో ఆంగ్లభాష నైపుణ్యాన్ని పెంపొందించాలని ఆంగ్ల ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. స్థానిక పీఎంఆర్సీ భవనంలో యంగ్ లీడర్స్ క్లబ్ ముగింపు శిక్షణా కార్యక్రమంలో ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రతీ విద్యార్థి ఆంగ్లభాషలో మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో జగన్, రోమీల, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరిట్ ప్రకారమే నియామకాలు చేపట్టాలి

నేరడిగొండ: సీఆర్టీ నియామక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని గిరిజన లంబాడాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్టీ నియామకాల్లో కుల, మత వివక్షకు తావు ఉండకూడదని, కేవలం మెరిట్ ప్రకారం ఉద్యోగాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లైవ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవీందర్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్ జాదవ్ పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

భీంపూర్: మండలంలోని రైతువేదికలో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. మేనేజర్ శ్రీకాంత్ రావు మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. వాడేగామ్, రాజ్‌ఘడ్, బెల్సారి రాంపూర్ గ్రామాలకు చెందిన 25 మంది గిరిజన మహిళలకు ముర్రాజాతి గేదెలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండల అధికారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

భీంపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ మాట్లాడుతూ.. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఆసుపత్రి పనులు షురూ

- పీహెచ్‌సీ మంజూరుతో ప్రజల హర్షం
- తీరనున్న గిరిజనుల ఇబ్బందులు



నిర్మిస్తున్న ఆసుపత్రి భవనం

సిరికొండ: ఎక్కడ ఏం జరిగిన.. ఎలాంటి ఆపద వచ్చిన, అనారోగ్యం చేసినా.. గిరిజనుల ప్రాణాలు గాలిలో కలిసిపోయేవి. కానీ ప్రభుత్వం మండల ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మండలానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేసింది. దీంతో మండల ప్రజల ఏన్నో ఏళ్ల కోరిక నెరవేరబోతుంది.

భవనం మంజూరు..

2016లో ఏర్పాటైన మండలంలో ఎలాంటి వైద్య సదుపాయాలు లేకపోవడంతో మారుమూల ప్రజలు పాము కాటుకు గురైనా.. గర్భిణులకు పురిటినొప్పులు వచ్చినా.. ఇటాంటి అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చినా.. మండల కేంద్రానికి చేరుకుని ఇక్కడి నుంచి ఇతర మండలాలైన ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండలంలోని పిట్టబొంగారంలోని పీహెచ్‌సీలకు వెళ్లాలి. సుమారుగా 25 కిలోమీటర్లు దూరంలోని ఆసుపత్రులకు వెళ్లే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోయేది. ఇలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించగా ప్రభుత్వం స్పందించి రూ. 1.43 కోట్ల నిధులతో ఆసుపత్రి భవనం మంజూరైంది. గిరిజన ప్రజల ఇబ్బందులు త్వరలోనే తొలగిపోనున్నాయి.

మొదలైన పనులు..

మండలంలో ప్రభుత్వ దవాఖానా లేక ఇబ్బందులు, నష్టాలు భరించిన మండల ప్రజలకు ఆసుపత్రి భవనం మంజూరు కావడంతో ఆసుపత్రి భవనం నిర్మాణం టెండర్ పూర్తయి నిర్మాణపు పనులు ప్రారంభం అయింది. ఆసుపత్రి నిర్మాణపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. భవనం పూర్తయి అందుబాటులోకి వస్తే ప్రజలు ఆరోగ్య కష్టాలు దూరం అవుతాయని ప్రజలు కోరుకుంటున్నారు.

ఇబ్బందులు తొలగిపోతాయి



మండలానికి పీహెచ్‌సీ భవనం మంజూరు చేయడంతో గిరిజనుల కష్టాలు తొలగనున్నాయి. ఆసుపత్రికి వెళ్లాలంటే ఇతర మండలాలకు వెళ్లాల్సి వచ్చే ది. ప్రభుత్వ ఆసుపత్రి భవనం మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది.

– పెందుర్ రామ్‌పాల్, రిమ్మ

నాణ్యతతో పనులు చేయాలి



మండలానికి ప్రభుత్వ దవాఖానా మంజూరు చేయడం ఎంతో సంతోషం. పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. కానీ నాణ్యతతో కూడిన పనులు జరగాలి. అలాగే త్వరగా పూర్తి చేసి, ఆసుపత్రిని వినియోగంలోకి తీసుకురావాలి.

– గోర్పుండ్ సంజీవ్, సిరికొండ

పచ్చదనం మధ్యలో చెత్తడంప్



ఓ వైపు నిండుగా పర్చుకున్న పచ్చదనం కనువిందు చేస్తుంటే.. మధ్యలో ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్త కుప్ప కంపు కొడుతుంది. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా వెళ్లే జాతీయ రహదారి 44ను ఆనుకుని ఇచ్చోడ మండల సమీపంలో సెగ్రిగేషన్ షెడ్‌ను నిర్మించి చెత్తాచెదారం అక్కడ పడేస్తున్నారు. పచ్చదనం మాటున చెత్తకుప్ప ఏంటని ప్రజలు చర్చించుకుంటున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలి

సిరికొండ: విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని డీఎల్‌పీవో ఫణీందర్ అన్నారు. మండలంలోని కేజీబీవీ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశ్, పాఠశాల ఎస్‌వో సంధ్యారాణి ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

రాయిగూడ గిరిజన ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ తుకారం శుక్రవారం పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు, హాస్టల్ సిబ్బందికి సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

జాబ్‌మేళాకు అపూర్వ స్పందన

ఉట్నూర్‌రూరల్: విద్య, వైద్యం, వ్యవసాయం అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జేసీఎన్ ఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరయ్యారు. ఆత్రం సుగుణతో కలిసి పలువురికి ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, సత్యవతి కోటేష్, మునిగల నర్సింగ్, పసుల చంటి, చరణ్ గౌడ్, సునీల్ జాదవ్, ముస్తఫా పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న నాయకులు

ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడుచుకోవాలి

తలమడుగు: ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సద్గురు గురువులు సూచించిన సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. బోథ్ నియోజవర్గంలోని శబరిమాత, పూలాజీ బాబా, బాజీరావు బాబా, ఇతర ఆధ్యాత్మికుల ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సోను మాతాజీ, జాదవ్ కిషన్, తోట వెంకటేశ్, కిరణ్ కుమార్, మొట్టే వెంకటమ్మ, దేవారెడ్డి, కేదారేశ్వర రెడ్డి, పిడుగు అభిరామ్ రెడ్డి, అగ్గిమల్ల గణేష్, అగ్గిమల్ల గంగన్న, మోతే శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత

ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రఘురామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బరంపూర్ కొండపైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బరంపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయం తిరుపతిగా అభివృద్ధి చెందడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కమిషనర్ సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదారేశ్వర రెడ్డి, పూజారి స్వస్తిక్ స్వామి, సీఐ విజయేందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక సంస్థలపై అభిప్రాయాలను సేకరించి పలు విషయాలను వెల్లడించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను 420 హామీలతో మోసం చేయడమే కాకుండా, ప్రతి ఇంటింటికీ అత్త కోడళ్లకు అందిస్తానన్న పెన్షన్‌లపై ఆరా తీయాలన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, మెట్టు ప్రహ్లాద్, గోవర్ధన్, గంధ్రత్ రమేశ్, సెవ్వ జగదీష్, రాజన్న, దేవిదాస్, పరమేశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోగు రామన్న

ప్రమాణ స్వీకారానికి తరలిరండి

ఇంద్రవెల్లి: రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావ్ ప్రమాణ స్వీకరం ఈనెల 27న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో నిర్వహించడం జరుగుతుందని, అధిక సంఖ్యలో ఆదివాసీలు తరలివచ్చి ప్రమాణ స్వీకరణ కార్యక్రమాన్ని తరలిరావాలని ఇంద్రవెల్లి మాజీ సర్పంచ్‌ల సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాయిసెంటర్ల సార్‌మేడిలు, ఆయా గ్రామాల పటేల్‌లు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల సంఘం నాయకులు మెస్రం నాగ్‌నాథ్, కినక జుగాదిరావ్, సిడాం గుణ్వంత్‌రావ్, మడావి భీంరావ్, మెస్రం భీంరావ్ పాల్గొన్నారు.

బోథ్: ఈనెల 27న ఆదిలాబాద్‌లోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించే రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పంద్రం శంకర్ కోరారు. బోథ్ మండలంలోని మేడిగూడ గ్రామంలో శుక్రవారం గ్రామస్తులతో సమావేశమై వివరాలు వెల్లడించారు. సమావేశంలో గ్రామపటేల్ తోడషం నిలకాంత్ రావ్, దేవరి కొంరం పోతన్న, తోడషం గోపాల్, తోడషం కైలాష్, దశరథ్, శంకర్, అనిల్, వినోద్, దీపక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

భక్తులకు సమస్యలు రాకుండా చూడాలి

ఇంద్రవెల్లి: ఈనెల 29న కేస్లాపూర్ నాగోబా ఆలయంలో నిర్వహించే నాగుల పంచమి పూజలు చేసేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయానికి సందర్శించారు. గ్రామ కమిటీ, మెస్రం వంశీయులతో మాట్లాడి ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్ స్థలం, దుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సాయన్న, మెస్రం ఆనంద్‌రావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

నేరడిగొండ: మండలంలోని కిష్టాపూర్ పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింగ్ కోరారు. శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పాఠశాల అభివృద్ధికి అవసరమైన నిధులు త్వరలో మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, దేవేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, ఆడే కైలాష్, వసంతరావ్ జాదవ్, సవాయిరామ్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించకుండా చర్యలు తీసుకోవాలి

తాంసి: మండల కేంద్రంలో కళాశాల, జిల్లా పరిషత్ పాఠశాల అనుకొని ఉన్న ఆటస్థలంలో ప్రహరీ నిర్మించకుండా చర్యలు చేపట్టాలని తాంసి యువకులు శుక్రవారం తహసీల్దార్‌ను లక్ష్మిని కోరారు. కళాశాల, స్కూల్ గ్రౌండ్‌లో కేజీబీవీ స్కూల్ సిబ్బంది ప్రహరీ నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో ఒక ఆటస్థలం మాత్రమే ఉందన్నారు. ప్రహరీ నిర్మాణం చేపడితే విద్యార్థులు, యువకులు క్రీడలకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. యువకులు రాము, అశోక్, రాజు, చిట్టి, సాయి ఉన్నారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ: ఇచ్చోడ మండల కేంద్రంలోని రాయల్ ప్యాలెస్‌లో శనివారం నిర్వహించనున్న జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ముఖరా(బి) మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్ కోరారు. శుక్రవారం ముఖరా(కె)లో జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించారు. జాబ్ మేళాకు హైదరాబాద్ నుంచి ప్రముఖ కంపెనీలు ప్రతినిధులు రానున్నట్లు తెలిపారు.

వసతి గృహాల్లో వైద్య శిబిరాలు

బోథ్: బోథ్ పట్టణంలోని ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందుల పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హాస్టల్ వంటగది, స్టోర్ రూమ్ లాంటి ప్రదేశాల్లో శానిటేషన్ పరిస్థితులను పరిశీలించారు. కార్యక్రమాల్లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు శ్రావణ్, ఫర్వీజ్, సూపర్‌వైజర్ కవిత, అనూష, సుమంగళ, గోవర్ధన్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలోని పుత్లీబౌలి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పలువురు కార్మికులు, మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వంట గదిని పరిశీలిస్తున్న వైద్యాధికారి

పాఠశాలల్లో కౌన్సిల్ ఎన్నికలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకులంలో శుక్రవారం స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించే విధంగా నిర్వహించారు. విద్యార్థుల నుంచి నామినేషన్లు స్వీకరించి, సక్రమంగా లేని వాటిని తిరస్కరించారు. పోలింగ్ సిబ్బందిగా ఉపాధ్యాయులు విధులు నిర్వహించారు. ఎన్నికల సక్రమంగా నిర్వహించేందుకు ఎన్‌సీసీ విద్యార్థులకు పకడ్బందీగా బందోబస్తు చేపట్టారు. ఎలక్షన్ కమిషనర్‌గా ప్రిన్సిపాల్ కిషన్, రిటర్నింగ్ ఆఫీసర్‌గా వైస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అబ్జర్వర్‌గా ఉపాధ్యాయురాలు శ్రీవాణి, పీవో వెంకటేశ్‌లు విధులు నిర్వహించి ఈవీఎంల పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. పోటీలో కాలేజ్ పిపుల్స్ లీడర్‌గా శ్రీనిషాంత్, డిప్యూటీ లీడర్‌గా సాయిచౌహన్ తేజ, స్పోర్ట్స్ లీడర్‌గా శంకర్, ప్రణయ్, లిటిల్ డాక్టర్‌గా సిద్ధు, తిరుపతి, కల్చరల్ లీడర్‌గా శ్రీకర్, లిటర్సీ లీడగర్‌గా శ్రీనివాస్, రాకేశ్‌లు ఎన్నికయ్యారు.

- ఇచ్చోడ మండలంలోని మేడిగూడ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం కౌన్సెలింగ్ ఎన్నికలు నిర్వహించారు. స్కూల్ కెప్టెన్‌గా సంధ్య, వైస్ కెప్టెన్‌గా గీత ఎన్నికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత ఆధ్వర్యంలో వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్నికల ద్వారా విద్యార్థులకు రాజకీయలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

జాగ్రత్తలు పాటించాలి

నేరడిగొండ: విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నేరడిగొండ, ఇచ్చోడ, బోథ్, బజార్‌హత్నూర్ మండలాల పరిధిలోని పలువురు విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారం కోసం అధికారులకు విన్నవించుకున్నారు. 56 దరఖాస్తులు రాగా, 20 పరిష్కరించారు. ఇందులో మెంబర్ టెక్నికల్ సలేంద్ర నారాయణ, మెంబర్ ఫైనాన్స్ లకావత్ కిషన్, ఫోర్త్ మెంబర్ రాజాగౌడ్, సీఈ జవహర్ చౌహాన్, విద్యుత్ శాఖ అధికారులు ఈదన్న, లక్ష్మణ్, నాగేంద్ర ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

బోథ్: బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామాన్ని బోథ్ ఎంపీడీవో రమేష్, మండల విద్యాధికారి మహమూద్ హుస్సేన్ శుక్రవారం సందర్శించారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల (జెడ్పీఎస్ఎస్), ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నిర్వహణ, పాఠశాలల పరిశుభ్రత వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.

రేషన్‌కార్డుల మంజూరులో నిర్లక్ష్యం

బేల: జిల్లా పౌర సరఫరాల అధికారి కొత్త రేషన్ కార్డుల మంజూరులో నిర్లక్ష్యం చేస్తున్నారని జూనోని గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ వాడయి వివేక్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జిల్లా పౌరసరఫరాల అధికారి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ రఘునాథ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. యూత్ నాయకులు మాడవార్ హరీశ్‌రెడ్డి, అనుష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఇచ్చోడ: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రమేశ్‌కు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా ఉపాధ్యాయుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. జిల్లా, మండల పరిషత్ పాఠశాలలో మౌలిక వసతులు లేక పోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యాసుందర్, రాజేందర్, జ్ఞానోబా, లక్ష్మణ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంక్షిప్తం..

బీసీ గురుకులం తనిఖీ

బేల: విద్యార్థులు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని మండల తహసీల్దార్ రఘునాథ్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రంగన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ఉద్యానవన శాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నర్సయ్యను టీఎన్‌జీవో నాయకులు సన్మానించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఉద్యానవన శాఖ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నాయకులు సంద అశోక్, నవీన్ కుమార్, ప్రవీణ్ కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మల్లెపూల నర్సయ్యను మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గోక గణేష్ రెడ్డి శుక్రవారం ఆయన కార్యాలయంలో సన్మానించారు. కల్యాణం రాజేశ్వర్, బొల్లారపు బాబన్న, రావుల నారాయణ ఉన్నారు.

ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలి

సాత్నాల: విద్యార్థులు ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని తహసీల్దార్ రాజేశ్వరి రాథోడ్ అన్నారు. భోరజ్ మండలం గిమ్మ ఎస్సీ హాస్టల్లో శుక్రవారం ఆమె సందర్శించారు. హాస్టల్ గదులను, వంటశాలలను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. హాస్టల్ వార్డెన్ దత్తు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ సందర్శించిన ఎంపీడీవో

జైనథ్: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఎంపీడీవో మహేశ్‌కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థులను మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారంగా భోజనం పెట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట హాస్టల్ వాడెన్ నారాయణ, తదితరులు ఉన్నారు.

ఓబీసీ సమ్మేళనానికి గంగారెడ్డి

బోథ్: ఢిల్లీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఓబీసీ సమ్మేళనంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పాల్గొన్నారు. బీసీ అభ్యున్నతికి కాంగ్రెస్ పాటుపడుతుందని, 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించిందని ఆయన అన్నారు. బీజేపీ పార్టీ రిజర్వేషన్లకు వ్యతిరేకమన్నారు.